సాక్షి ఏలూరు

మంగళవారం । 12 । మార్చి । 2024



ధార్మిక చింతనకు ప్రతీక

ముస్లింలకు అతి పవిత్రమైన రంజాన్ నెల ఉపవాసాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మసీదులు ముస్తాబయ్యాయి.

8లో



బలివే ఆదాయం లెక్కింపు

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బలివే రామలింగేశ్వరస్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.14.47 లక్షల ఆదాయం వచ్చింది.

8లో

రంజాన్ వేళలు

ఏలూరు

ఇఫ్తార్	సహరి
మంగళ	బుధ
సా॥ 6.20	ఉ॥ 4.51

న్యూస్‌రీల్

185 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ



ఉత్తర్వులు అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో) : వైద్యారోగ్య శాఖలో 185 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ సోమవారం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు అందజేశారు. ముందుగా డీఎంహెచ్‌ఓ శర్మిష్ట మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 269 కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రతిపాదనలు పంపంగా 185 మందిని పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించారన్నారు. వీటిలో జీఓఎంఎస్ నం.30 ప్రకారం 161 హెల్త్ అసిస్టెంట్లు (పురుషులు)ను ప్రతిపాదించగా 114 మందిని ల్యాబ్ టెక్నీషియన్స్ 14 మందికి ఒకరు, ఫార్మాలాజిస్టు 14 మందికి 9 మందిని క్రమబద్ధీకరించారన్నారు. అలాగే జీఓఎంఎస్ నం.31 ప్రకారం 78 మంది ఏఎన్‌ఎం (మహిళలు)ను ప్రతిపాదించగా 61 మందిని రెగ్యులర్ చేశారన్నారు. జేసీ లావణ్యవేణి, డీఐఓ నాగేశ్వరరావు, డీసీహెచ్ డా.పాల్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అర్జీలపై సత్వర చర్యలు



ఫిర్యాదులు పరిశీలిస్తున్న ఏఎస్పీ స్వరూపరాణి

ఏలూరు (టూటౌన్): ప్రతి సోమవారం నిర్వహించే స్పందనలో ప్రజల నుంచి వచ్చే అర్జీలపై సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ అడ్మిన్ జి.స్వూరూపరాణి ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 60 ఫిర్యాదులు అందగా వీటిలో అధికంగా వరకట్నం వేధింపులు, సరిహద్దుల విషయంలో గొడవలు, సివిల్ వివాదాలపై ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఏఎస్పీ స్వరూపరాణి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు ఇచ్చారు.

ఈవీఎం గోదాము తనిఖీ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాకు చెందిన ఎన్నికల సామగ్రి భద్రపరిచిన గోదామును సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేసినట్టు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఈవీఎం యంత్రాలు, వీవీప్యాట్ గోదాములను సందర్శించి సీళ్లను పరిశీలించామన్నారు. గోదాము వద్ద పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డీఆర్వో డి.పుష్పమణి ఆయన వెంట ఉన్నారు.

నేడు గవర్నర్ ఏలూరు రాక

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం ఉదయం 8 గంటలకు విజయవాడ నుంచి కారులో బయలు దేరి 9 గంటలకు ఏలూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. ఏలూరు రైల్వే స్టేషన్‌లో గూడ్స్‌షెడ్ ఆధునీకరణ పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు ఏలూరు నుంచి కారులో బయలు దేరి 11.30 గంటలకు విజయవాడ రాజభవన్‌కు చేరుకుంటారు.

ప్రారంభించిన భవనాలకు మళ్లీ ప్రారంభోత్సవమా?

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ విమర్శ

కాళ్ల : ఉండి నియోజకవర్గంలో ఎమ్మెల్యే తీరు హాస్యాస్పదంగా ఉందని, ప్రారంభించిన ప్రభుత్వ భవనాలను మ రలా ప్రారంభించి ఆనందం పొందుతున్నా రని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ఘాటుగా విమర్శించారు. పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆకివీడు మండలం కుప్పనపూడిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతనంగా నిర్మించి ప్రారంభించిన ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే రామరాజు జనసేన, టీడీపీ కార్యకర్తలతో కలిసి సోమవారం మరోమారు ప్రారంభించడాన్ని ఖండించారు. లక్ష లాది రూపాయలతో ప్రతిష్టాత్మకంగా సచివాలయం, రైతుభరోసా, హెల్త్ క్లినిక్ భవనాలను ఆకివీడు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నంద్యాల సీతారామయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వం సుందరంగా తీర్చిదిద్దిందన్నారు. వీటిని ఈనెల 5న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభిస్తే.. వాటిని ఎమ్మెల్యే రామ రాజు నిర్మించినట్టు మరలా ప్రారంభించడం ఏంటని ప్రశ్నించారు. గత టీడీపీ హయాంలో కూడా ఇలానే చేసిన చోటే మరోమారు శంకుస్థాపనలు చేసి ప్రజల ఆగ్రహానికి గురైన విషయాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ గుర్తుచేశారు.

ఉద్యాన ప్రాధాన్యం

- ప్రతి మొక్కకూ రాయితీ
- రికార్డు స్థాయిలో ఆయిల్‌పామ్ సాగు
- రైతుల వద్దకు ఉద్యాన అధికారులు
- అదనంగా 1,200 హెక్టార్లకు పైగా పంటలు
- కోల్డ్ రూమ్, కలెక్షన్ సెంటర్లకు నిధులు



నూతనంగా రైతులకు మంజూరైన కలెక్షన్ సెంటర్



కోల్డ్‌రూమ్స్

ఏలూరు (మెట్రో): రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. రైతు ప్రభుత్వంగా పేర్గాంచిన జగనన్న సర్కారు అన్ని పంటల ప్రోత్సాహానికి చర్యలు తీసుకుంది. ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యమిస్తూ రైతులను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే రైతుల సంక్షేమం కోసం ఊరూరా రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఉద్యాన పంటల అభివృద్ధి, సాగు విస్తరణకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా కలెక్షన్ సెంటర్లు, కోల్డ్‌రూమ్‌లు ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు ఆయా నిర్మాణాలను నిధులను అందిస్తోంది.

గతంలో వ్యవసాయ దండగ అనే రోజుల నుంచి వ్యవసాయం పండగ రోజులకు తీసుకువచ్చిన జగన్ ప్రభుత్వం ప్రతి పంటను సంరక్షించి ప్రతి రైతు బాగోగులు చూసుకుంటోంది. దీనిలో భాగంగా ప్రధాన ఉద్యాన పంటగా ఉన్న ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంది. జిల్లాలో 1.21 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ఉండగా ప్రస్తుత ఏడాది 9,526 హెక్టార్ల సాగు పెంచేందుకు చర్యలు తీసుకుంది. వాస్తవానికి 8 వేల హెక్టార్లల్లో సాగు చేయించేందుకు జిల్లా ఉద్యాన అధికారులు లక్ష్యంగా నిర్దేశించగా వారు రైతులను ప్రోత్సహించి అదనంగా 1,500 హెక్టార్ల సాగు చేయించారు. జిల్లాలో మామిడి, జీడిమామిడి, డ్రాగన్‌ఫ్రూట్ ఇలా ఉద్యాన పంటలు 1,200 హెక్టార్లు నూతనంగా సాగు చేయించేందుకు జిల్లా ఉద్యాన అధికారులు లక్ష్యంగా నిర్దేశించగా వాటిని పూర్తిచేశారు.

27 కలెక్షన్ సెంటర్లు

ప్రభుత్వం, అధికారుల ప్రోత్సాహంతో రైతులు ఉద్యాన పంటల సాగుకు ముందుకు వస్తున్నారు. జిల్లాలో 27 కలెక్షన్ సెంటర్లను మంజూరు చేసి ఒక్కో కేంద్రానికి రూ.11.25 లక్షలు మంజూరు చేయగా రైతులు వాటిలో 6 కలెక్షన్ సెంటర్లను పూర్తి చేశారు. నాలుగు కలెక్షన్ సెంటర్లకు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేసింది. 9 కలెక్షన్ సెంటర్లు నిర్మాణ దశలో ఉన్నాయి. అలాగే జిల్లాలో 4 కోల్డ్ రూమ్‌లు మంజూరు చేయగా ఒక్కో దానికి రూ.9.37 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆయిల్‌పామ్‌కు రూ.21 వేలు

హెక్టారు ఆయిల్‌పామ్ సాగుకు రూ.21 వేల రాయితీ ప్రభుత్వం అందిస్తుండగా ఈ సీజన్‌లో అదనంగా 9 వేల హెక్టార్ల ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏడాదికి సాగు మెయింటెనెన్స్‌లో భాగంగా రూ.5,250 నాలుగేళ్ల పాటు అందించనున్నారు.

జిల్లాలో ఉద్యాన పంటల సాగు

పంట	సాగు విస్తీర్ణం
ఆయిల్‌పామ్	1.26 లక్షలు
కోకో	32,452
కొబ్బరి	35,324
నిమ్మ	8,285
మామిడి	37,519
అరటి	4,418
బొప్పాయి	414
జీడిమామిడి	16,325

ఉద్యాన సాగుకు ప్రభుత్వ ఊతం



జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. లక్ష్యానికి మించి ఈ ఏడాది అధికంగా రైతులు సాగు చేశారు. జిల్లా ఉద్యాన శాఖాధికారులు రైతులను ప్రోత్సహించి అదనంగా 9,500 హెక్టార్లకు పైగా ఆయిల్‌పామ్, 1,200 హెక్టార్లకు పైగా పలు రకాల పంటలు సాగుకు చర్యలు తీసుకున్నారు.

– బి.లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్, ఏలూరు

స్పందనలో 179 అర్జీలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో అర్జీలకు సంతృప్తికర రీతిలో పరిష్కారం చూపాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీతో కలిసి కలెక్టర్ 179 అర్జీలు స్వీకరించారు.

అర్జీల్లో కొన్ని..

- ద్వారకాతిరుమల మండలం తక్కెళ్లపాడుకు చెందిన రామాంజనేయులు తన పొలం రిజిస్ట్రేషన్ కోసం చలానా కట్టిన తర్వాత రిజిస్ట్రేషన్ లోపం ఆన్‌లైన్‌లో చూపుతుందన్నారు.
- ఏలూరు రూరల్ మల్కాపురానికి చెందిన స్వర్ణలత తమకు హక్కు ఉన్న భూమిలో సరిహద్దుదారులు అక్రమంగా ప్రహరీ గోడ నిర్మించారని, సర్వే చేసి న్యాయం చేయాలని అర్జీ అందజేశారు.
- లింగపాలెం మండలం ములగలపాడుకు చెందిన అర్జునరావు తమ కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్స్ ఇప్పించాలని కోరారు.
- పెదవేగి మండలం కొప్పాకకి చెందిన సర్వేశ్వరరావు తన ఆధార్ కార్డు నంబర్‌తో తనకు లేని భూమిని చూపిస్తుందని సరిచేయాలని వినతిపత్రం అందజేశారు.

సీఎం జగన్ మహిళా పక్షపాతి



లబ్ధిదారులకు చేయూత చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, దూరదృష్టితో మహిళలు, రైతులతో పాటు ప్రతిఒక్కరి భవిష్యత్తు, భద్రత ఆలోచించే మహోన్నత వ్యక్తి అని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం ఏలూరు ఇంద్రవనంలో ఎమ్మెల్యే కొఠారు ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు కామినేని నాని అధ్యక్షతన వైఎస్సార్ చేయూత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ వైఎస్సార్ అడుగుజాడల్లో సీఎం జగన్ పయనిస్తున్నారని, నవరత్న పథకాలతో పాటు మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. దీంతో మహిళల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో జగన్ మరలా ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఎమ్మెల్యేగా కొఠారు 50 వేల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. దెందులూరు అభివృద్ధి, సంక్షేమానికి జిల్లాపరిషత్ నుంచి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సూచన మేరకు పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాలకు నిధులు కేటాయించామన్నారు. అలాగే ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ తప్పక విజయం సాధిస్తారన్నారు. ఏలూరు జిల్లా ప్రజలంతా ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో విజయం చేకూర్చాలని కోరారు. అనంతరం చేయూత లబ్ధిదారులకు ఎమ్మెల్యే కొఠారు, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ చెక్కు అందించారు.

పెద్దింట్లమ్మ జాతర ప్రారంభం



ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ కుటుంబ సభ్యులు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర (తీర్థం)ను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సోమవారం ప్రారంభించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అర్చకులు పెద్దింట్లమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ పెద్దింట్లమ్మ ఆలయం వద్ద రూ.4.50 కోట్ల దాతల విరాళంతో భారీ అనివేటి మండపాన్ని నిర్మించామన్నారు. కొల్లేరు ప్రజల చిరకల కలగా మారిన సర్కారు కాల్వపై పెద్దింట్లమ్మ వారధిని పూర్తి చేశామన్నారు. దీని ద్వారా నేరుగా వాహనాలు దేవస్థానం వరకు చేరుతాయన్నారు. జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కొల్లేరు జాతరను విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ కురేళ్ళ బేబీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ నాయకులు ముంగర నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు భట్రాజు శివాజీ, దేవస్థానం చైర్మన్ పులవర్తి లక్ష్మణ్, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

అమ్మవారికి పంచ హారతులు

జాతరలో భాగంగా తొలిరోజు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచానం, పంచామృతాభిషేకం, నూతన వస్త్ర అలంకరణ, పుష్పాలంకరణ, శ్రీచక్రార్చన, ధూపసేవ, బాలభోగం నిర్వహించారు. భుజబలపట్నం గ్రామానికి చెందిన ముదునూరి రామలింగ రాజు, కనుమూరి నాగవెంకట సుబ్బరాజు, పేరిచర్ల హేమంత్‌వర్మ దంపతులు పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, ప్రసాదానికి దాతలుగా వ్యవహరించారు. అమ్మవారికి సాయంత్రం అర్చకులు పంచ హారతులు సమర్పించారు.

ఏడుగురు ఉపాధ్యాయులకు పదోన్నతి



పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు నియామకపత్రాలు అందిస్తున్న డీఈఓ అబ్రహం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో స్పెషల్ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ)ల నుంచి స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)గా ఏడుగురు ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పిస్తూ ఏలూరు డీఈఓ ఎస్.అబ్రహం సోమవారం నియామకపత్రాలు అందజేశారు. బి.నీలిమ (ఉండ్రాజవరం)ను ముక్కామల హైస్కూల్, సీహెచ్ వీర బసవరాజు (కోరుమిల్లి)ను కుముదవల్లి హైస్కూల్, కె.దుర్గాప్రసాద్ (మల్లవరం)ను వదలి హైస్కూల్, జె.వెంకట రమణ (దొంగరావిపాలెం)ను దేవరపల్లి హైస్కూల్, సీహెచ్ రాజేష్ (గుళ్లపాడు)ను చిననింద్రకొలను హైస్కూల్, పి.శ్వేత (చాగల్లు)ను వాదాలకుంట హైస్కూల్, జె.వెంకట కృష్ణప్రసాద్ (రాఘువాపురం)ను జీలుగుమిల్లి హైస్కూల్‌కు పదోన్నతిపై బదిలీ చేశారు. వీరికి పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 12,684 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని 51 కేంద్రాల్లో సోమవారం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు మ్యాథ్స్–బీ, జువాలజీ, హిస్టరీ –2 పరీక్షలు నిర్వహించారు. 13,145 మంది విద్యార్థులకు 12,684 మంది హాజరయ్యారు. వీరిలో 11,277 మంది జనరల్ విద్యార్థులకు 10,946 మంది, 1,868 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1,738 మంది హాజరయ్యారు. విద్యార్థుల హాజరు 97 శాతంగా నమోదైంది. కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదయ్యిందని పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు.

'పశ్చిమ'లో 97 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో సోమవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్ఐఓ కె.చంద్రశేఖరబాబు తెలిపారు. 50 కేంద్రాల్లో 97 శాతం హాజరు నమోదైందన్నారు. జనరల్ పరీక్షకు 13,202 మందికి 12,889 మంది, ఒకేషనల్ పరీక్షకు 1,424 మందికి 1,338 మంది హాజరయ్యారు.

మహిళలే బ్రాండ్ అంబాసిడర్లు



తాడేపల్లిగూడెంలో మహిళలకు చేయూత చెక్కు అందిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలే బ్రాండ్ అంబాసిడర్లు అని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని బలుసులమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద సోమవారం మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ అధ్యక్షతన వైఎస్సార్ చేయూత చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతతోనే కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తాయన్నదే సీఎం జగన్ ఆకాంక్ష అన్నారు. ఇందుకు అనుగుణంగా పథకాలన్నీ మహిళల పేరిట అమలు చేస్తున్నారన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం అమ్మఒడి, డ్వాక్రా రుణమాఫీ, చేయూత విద్యాదీవెన, వసతి దీవెన, రూ.3 వేల పింఛన్ వంటి పలు పథకాలు అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిగా మరోమారు గెలిపించేందుకు మ హిళలంతా సిద్ధం ఉన్నారన్నారు. 16,696 మంది మహిళలకు సంబంధించి రూ.20.05 కోట్ల చెక్కును అందజేశారు.

ఆంధ్రజ్యోతిపై పరువు నష్టం దావా వేస్తా

ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్



భీమవరం: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుంటున్న తనపై బురదజల్లి టీడీపీ, జనసేన కూటమికి లబ్ధి చేకూర్చడానికి ఆంధ్రజ్యోతి ప్రచురించిన అసత్య కథనంపై పరువు నష్టం దావా వేస్తానని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్ భీమవరానికి 100 పడకల ఆస్పత్రి మంజూరు చేస్తే నాలుగెకరాల భూమిని తమ కుటుంబం కొనుగోలు చేసి ఉచితంగా అందించామని, దానిని కూడా రాజకీయం చేసేలా తప్పుడు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం రైతులను ఒప్పించి నిబంధనల మేరకు భూములు కొనుగోలు చేస్తే దానిలో అవినీతికి పాల్పడ్డాడని ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. తనకున్న దానిలో ఎంతో కొంత ప్రజావసరాలకు ఇవ్వడమే గానీ అడ్డదారుల్లో సంపాదించింది లేదని శ్రీనివాస్ స్పష్టం చేశారు. తనపై నిరాధారంగా వార్తలు ప్రచురించిన ఆంధ్రజ్యోతి యాజమాన్యం ఆధారాలతో కోర్టులో నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. మట్టి పూడికలు, లేఅవుట్లు, బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు కూడా తన కనుసన్నల్లోనే జరుగుతున్నాయంటూ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఇవన్నీ యథావిధిగా జరుగుతాయని, ఎమ్మెల్యేలకు ప్రమేయం ఉండదని తెలిపారు. ఎవరికైనా ఇబ్బంది ఏర్పడితే అధికారులతో మాట్లాడి వారికి న్యాయం చేయడం తప్ప అడ్డగోలుగా వ్యవహరించలేదన్నారు. చంద్రబాబు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా 850 ఎకరాల్లో రూ.లక్ష కోట్ల కుంభకోణం చేస్తే ఆంధ్రజ్యోతి ఎందుకు వార్తలు వేయలేదని శ్రీనివాస్ ప్రశ్నించారు.

ఎంఎస్‌ఎంఈ సర్వే వేగిరపర్చాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో ర్యాంప్ స్కీం కింద చేపట్టిన ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగిరపర్చాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సర్వేపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో తయారీ, సేవ, వాణిజ్య రంగాలకు సంబంధించి 74 వేల సర్వీసులకు సంబంధించి సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకురావాలన్నారు. ఇప్పటి వరకు 1,590 సర్వీసుల సర్వే పూర్తయిందని, మిగిలిన సర్వే ప్రక్రియను మూడు రోజుల్లో గణనీయమైన ప్రగతిలోకి తీసుకుని రావాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ అందరికీ ఇళ్లకు సంబంధించి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 68,017 రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారని (94.37 శాతం), మిగిలిన 4,061 రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఏలూరు డివిజన్‌లో అత్యధికంగా 3,451 పెండింగ్‌లో ఉన్నాయని వీటిలో ఏలూరు అర్బన్‌లో 2,434 ఉన్నాయన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి డి.పుష్పమణి, ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బలివే హుండీ ఆదాయం రూ.14.47 లక్షలు

బలివే (ముసునూరు): మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బలివే రామలింగేశ్వర స్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ.14లక్షల 47 వేల 371 ఆదాయం లభించినట్లు ఈఓ నల్లూరి సతీష్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆలయం వద్ద ఉత్సవాల అధికారి హరిప్రకాష్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ, రెవెన్యూ, పోలీస్ శాఖాధికారుల సమక్షంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది స్వామివారికి రూ.4 లక్షల 11వేల 671 అదనంగా ఆదాయం లభించిందన్నారు. సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ దంపతులు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, సభ్యులు జితేంద్ర, రాంబాబు, లక్ష్మణరావు, పెద్దలు చెన్నయ్య, చిట్టిబొమ్మ సూరిబాబు, నాయుడు సత్యనారాయణ, రాము, భక్తులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 12 మేక పిల్లల మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన మేక పిల్లలు

చాట్రాయి: చనుబండ గ్రామంలో వీధి కుక్కల దాడిలో 12 మేక పిల్లలు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో మోదుగు జోజికి చెందిన 12 మేక పిల్లలను సోమవారం మధ్యాహ్నం దొడ్డిలో పెట్టి భోజనానికి ఇంటికి వెళ్లాడు. గుంపులుగా వచ్చిన వీధికుక్కలు దొడ్డిలో ఉన్న మేక పిల్లలపై దాడి చేసి చంపాయి. నాలుగు నెలల్లో వీటిని రూ.లక్షకు అమ్ముకునే వాడినని బాధితుడు వాపోయాడు.

ధార్మిక చింతనకు ప్రతీక.. రంజాన్

- నేటి నుంచి ముస్లింల ఉపవాస దీక్షలు
- పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంగా నమ్మిక


చింతలపూడిలో ముస్తాబైన జామియా మసీదు

చింతలపూడి: ముస్లింలకు అతి పవిత్రమైన రంజాన్ నెల ఉపవాసాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. సోమవారం నెల వంక దర్శనంతో రంజాన్ నెల ప్రారంభమైంది. పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంగా ముస్లింలు విశ్వసించే ఈ నెలంతా ఉపవాసాలు, ప్రత్యేక ప్రార్థనలు, దాన ధర్మాలతో గడుపుతారు. రోజు మొత్తం ఆరాధనలోనే ఎక్కువ సమయం గడుపుతారు. ఖురాన్ ప్రకారం రంజాన్ నెలలో విధిగా ఉపవాస వ్రతాన్ని పాటిస్తారు. రంజాన్ నెల ముస్లిం విశ్వాసుల పండుగ. అభిమానానికి, స్నేహానికి ప్రతీకగా దీనిని ఆచరిస్తారు. రంజాన్ నెలలో ముస్లింలు క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనతో అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, కై కలూరు, పట్టణాల్లో రంజాన్ పండుగను ముస్లింలు ఏటా ఘనంగా జరుపుకుంటారు.

నిష్ఠతో ఉపవాసాలు

రంజాన్ మాసం ప్రారంభమైన నాటి నుంచి ముగిసేవరకు ముస్లింలు పగలు నిష్ఠగా (రోజా) ఉపవాస దీక్షలను పాటిస్తారు. కేవలం ఆహార పానీయాలను మానేయడం మాత్రమే రోజా కాదు. నిష్ఠ, నియమాలతో కూడుకున్న జీవన విధానాన్ని ఆచరిస్తారు. తెల్లవారుజామున ఆహారం తీసుకోవడాన్ని సహర్ అని, సాయంత్రం ఉపవాస దీక్ష విరమణలో తీసుకునే ఆహారాన్ని ఇఫ్తార్ అని అంటారు. ఇలా ప్రతి రోజూ సుమారు 13 గంటల పాటు కఠిన ఉపవాస దీక్షను అవలంభిస్తారు. ఒక వేళ ఏదైనా అనారోగ్యంతో ఉపవాసం ఉండలేక పోతే అలాంటి వారు రంజాన్ తర్వాత వాటిని పూర్తి చేయాల్సి ఉంటుంది.

షబ్–ఎ–ఖద్ర్

రంజాన్ నెల ప్రారంభమైన 27వ రోజు షబ్–ఎ–ఖద్ర్ ను ముస్లింలు జరుపుకుంటారు. ఈ రోజున దివ్యఖురాన్ అవతరించిందని ముస్లింల విశ్వాసం. ఈ రోజున రాత్రంతా జాగరణ చేసి ప్రార్థనలతో గడుపుతారు. ఆ రాత్రి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసిన వారికి ఎన్నో సంవత్సరాల పాటు ప్రార్థనలు చేస్తే వచ్చే పుణ్యం దక్కుతుందని విశ్వాసం.

జకాత్

ముస్లింలకు నమాజ్, రోజా ప్రకారమే జకాత్ కూడా నిర్ణయింపబడింది. దైవం కోసం, దైవ ప్రసన్నత పొందడానికి ఒక బాధ్యతగా సంపదలో కొంత మొత్తాన్ని పేదలకు అందించడమే జకాత్ ముఖ్య ఉద్దేశం. రంజాన్ నెలలోనే ముస్లింలు విధిగా జకాత్ చెల్లిస్తారు. పేద, ధనిక అంతరాలను రూపుమాపడానికి జకాత్ తోడ్పడుతుందని నమ్ముతారు. జకాత్ అంటే పరిశుద్ధ పరిచేది అని అర్థం.

ఫిత్రా

రంజాన్ నెల అంతా నమాజులు, ఉపవాసాలు, జకాత్ చెల్లించడంతో పాటు నెల ముగిసి పండుగ జరుపుకునే ముందు ఫిత్రా అంటే దానం చేస్తారు. పేదలు కూడా పండుగ రోజు సంతోషంగా పాల్గొనాలని చేసిన ఏర్పాటు ఇది. కుటుంబంలో ఎంత మంది సభ్యులు ఉంటే అందరి తరుపున విధిగా ఫిత్రా చెల్లిస్తారు. ఒక్కో ఫిత్రా కింద రెండున్నర కిలోల ఆహార ధాన్యాలు, లేదా అందుకు సమానమైన నగదు చెల్లించాలి.

పది రోజులకో ప్రత్యేకత

30 రోజుల ఉపవాస దినాల్లో ప్రతి 10 రోజులకూ ఓ ప్రత్యేకత ఉంది. మొదటి 10 రోజులు కారుణ్య దినాలుగా భావిస్తారు. అల్లాహ్ కారుణ్యం కోసం ఈ పది రోజులు ఉపవాసం ఉంటారు. 11 నుంచి 20వ రోజు వరకు క్షమాభిక్ష దినాలుగా పరిగణిస్తారు. తమ పాపాలను క్షమించమని అల్లాహ్‌ను వేడుకుంటూ ఉపవాసాలు ఉంటారు. చివరి పదిరోజులు నరకాగ్ని నుంచి కాపాడమని దువాలు చేస్తూ ఉపవాసాలు పాటిస్తారు.

హలీమ

ప్రతి దినం ఇఫ్తార్ సమయంలో సేవించే హలీద (జావ)కు కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. మసాలా దినుసులతో పాటు ప్రత్యేక ఆహార పదార్థాలతో దీన్ని తయారు చేస్తారు. బొంబాయి రవ్వ, బియ్యం రవ్వ, మేక మాంసం తదితర పదార్థాలను కలిపి జావ తయారు చేస్తారు. దీనిని మట్టి పాత్రలలో సేవిస్తారు.

షవ్వాల్

ఈ విధంగా నెల అంతా పవిత్ర కార్యక్రమాలతో సాగిన ఉపవాస వ్రత దీక్ష.. షవ్వాల్ నెలవంక ప్రత్యక్షమవగానే ముస్లింలు ఉపవాసాల్ని విరమించి మరుసటి రోజున పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో సంతోషాలతో జరుపుకుంటారు. షవ్వాల్ నెల మొదటి రోజున జరుపుకునే పండుగను ఈదుల్ ఫితర్ అంటారు. ఉపవాస దీక్షలకు మసీదులను సిద్ధం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు వెసులు బాటు

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ముస్లిం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం వెసులు బాటును కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సాయంత్రం ఇఫ్తార్ సమయంలో ఒక గంట ముందే ఇళ్లకు వెళ్ళేందుకు అనుమతి మంజూరు చేశారు.

దైవ భీతిని కలుగజేస్తుంది



ఉపవాసం మనిషిలో దైవభీతిని కలుగజేస్తుంది. అల్లాహ్‌కు వినమ్రంగా మారుస్తుంది. కోరికలకు కళ్లెం వేస్తుంది. ఉపవాసం ఉండే మనిషికి మనసు మీద నియంత్రణ సులువు అవుతుంది. ఆరోగ్యంతో పాటు ఇతరుల పట్ల సోదరభావం పెరుగుతుంది. ఆకలితో ఉన్నవారు, అవసరాలతో ఉన్న వారిపై దయాభావం పెరుగుతుంది. త్యాగ నిరతిని పెంపొందించే ఉపవాస దీక్షలు ప్రతి ముస్లిం విధిగా చేయాలి.

– మహమ్మద్ అబ్దుల్ వదూద్, జామియ మస్జిద్ ఇమామ్

14 నుంచి శ్రీవారి సాయంకాల్చారన వేళలో మార్పు

ద్వారకాతిరుమల: శ్రీవారి సాయంకాలార్చన సమయంలో ఈనెల 14 నుంచి మార్పులు చేసినట్లు ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు సోమవారం చెప్పారు. ప్రస్తుతం సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు ఈ అర్చన జరుగుతోంది. అయితే 14 నుంచి మీన సంక్రమణం సందర్భంగా సాయంకాలార్చన 5:30 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహిస్తామని ఈవో తెలిపారు. ఆ తర్వాత నుంచి భక్తులకు శ్రీవారి దర్శనాన్ని కల్పిస్తామని తెలిపారు.

విద్యుదాఘాతానికి జార్ఖండ్ యువకుడి మృతి

ఉండి: పొట్టకూటికోసం వలస వచ్చిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్ జిల్లా కేషిడ్ గ్రామానికి చెందిన మాణిక్ బావురీ (24) భీమవరానికి చెందిన చేపల వ్యాపారి తమనంపూడి శ్రీనివాసరెడ్డి వద్ద పనికి నెల క్రితం చేరాడు. ఉండి–గణపవరం రోడ్డులో ఓ పరిశ్రమలో రొయ్యల ప్రోసెసింగ్ షెడ్‌ను ఏర్పాటు చేసే పనుల కొరకు మాణిక్ బావురీతో పాటు మరి కొంతమంది వెళ్లారు. ఆదివారం పనిచేస్తుండగా, విద్యుత్ మోటార్ వైరు కిందపడి ప్రమాదకరంగా ఉండటంతో దీనిని కొబ్బరిచెట్టుకు కట్టేందుకు ఇనుప నిచ్చెన వేసుకుని మరో కూలీ చందన్‌కుమార్ సహాయంతో చెట్టు ఎక్కాడు. చెట్టు వద్ద విద్యుత్ వైర్లకు నిచ్చెన తగలడంతో షాక్‌కు గురైన బావురీ నిచ్చెన పైనుంచి కిందపడ్డాడు. నిచ్చెన పట్టుకున్న చందన్‌కుమార్ కూడా షాక్ తగిలి అచేతనంగా పడిపోయాడు. ఇద్దరినీ ఉండి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బావురీని పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మరో వ్యక్తికి చికిత్స అందిస్తున్నారు. చందన్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘భూహక్కు’తో రైతుల జీవితాల్లో వెలుగులు

- శాశ్వత భూహక్కు పంపిణీ చరిత్రాత్మకం
- రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత
- ఐఎస్ జగన్నాథపురంలో 169 మందికి 125 ఎకరాల భూపంపిణీ


ఐఎస్ జగన్నాథపురంలో లబ్ధిదారునికి భూహక్కు పట్టాను అందజేస్తున్న మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని తీసుకువచ్చి రైతుల జీవితాల్లో వెలుగులు నింపారని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో 169 మంది రైతులకు 125 ఎకరాల భూమిని సోమవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు భూహక్కు పట్టాలను అందజేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి వనిత మాట్లాడుతూ జగనన్నకు రైతుల కష్టాలు పూర్తిగా తెలుసన్నారు. అందుకే రైతన్నల శ్రేయస్సు కోసం జగనన్న అనేక పథకాలను ప్రవేశపెట్టారని, అందులో ముఖ్యమైనది ఈ భూహక్కు పథకమన్నారు. లక్షలాది మంది రైతుల కుటుంబాల్లో ఈ పథకం సంతోషాన్ని నింపిందన్నారు. ఎన్నో ఏళ్లుగా పంటలు పండిస్తున్నప్పటికీ భూమిపై హక్కులేక అభద్రతా భావంతో ఉన్న రైతుల్లో ఈ పథకం ధైర్యాన్ని నింపిందన్నారు. తాను టీడీపీ హయాంలో ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఐఎస్ జగన్నాథపురం భూసమస్యలపై పోరాటం చేశానన్నారు. అయితే జగనన్న తీసుకువచ్చిన భూహక్కు పథకం వల్లే ఇప్పుడు ఈ పట్టాలను పంపిణీ చేయగలిగామన్నారు. ఈ భూ పంపిణీలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు కృషి ఎనలేనిదని కొనియాడారు. ఎన్నికల సమయం దగ్గర పడడంతో ఎంత బిజీబిజీగా ఉన్నా జిల్లా కలెక్టర్‌తో సహా, మిగిలిన రెవెన్యూ అధికారులంతా ఈ పట్టాల పంపిణీకి ఎంతగానో సహకరించారన్నారు. ఈ పట్టాలు రిజిస్ట్రేషన్ అయ్యేలా చూస్తామన్నారు. ఐఎస్ జగన్నాథపురం గ్రామంలో భూపట్టాల పండుగ కనిపిస్తోందన్నారు. రెవెన్యూ అధికారులందరికీ రైతులు తరపున ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు చెప్పారు. ఇంకా మిగిలిన 22 మందికి త్వరలో భూ హక్కు పట్టాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యులు చిగురుపల్లి శామ్యూల్, గ్రామ సర్పంచ్ పసుపులేటి ఏసుబాబు, ఉప సర్పంచ్ అయినపర్తి కుటుంబరావు, పసుపులేటి సాయిబాబు, మటపర్తి పుల్లయ్య, దాసరి ఏసురత్నం, పోల్కంపల్లి అనిల్, చెలికాని సంజయ్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, వామిశెట్టి పరమేశ్వరరావు, గుర్రాల లక్ష్మణ్, బొండాడ వెంకన్నబాబు, దాసరి రాంబాబు, మానుకొండ కన్నయ్య, జంగా వెంకట కృష్ణారెడ్డి, చెలికాని బుల్లియ్య తదితరులున్నారు.

రుణపడి ఉంటాం



మేం సాగు చేసుకుంటున్న భూమిపై హక్కు లేక ఇన్నాళ్లు అభద్రతాభావంతో బతికాం. అయితే సీఎం వైఎస్ జగన్ చొరవతో మాకు భూహక్కు పట్టాలు అందాయి. ఎంతో సంతోషంగా ఉంది. జీవితాంతం జగనన్నకు, మంత్రి వనితమ్మకు రుణపడి ఉంటాం.

– బోద మధులత, ఐఎస్ జగన్నాథపురం

మా కష్టాలు తీరినట్లే



మేం సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు ఇస్తామని గత ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ నాయకులు హామీ ఇచ్చారు. పట్టాలు ఇస్తారో లేదో అని ఆందోళన చెందాం. కానీ ఇచ్చిన మాటకు కట్టుబడి పట్టాలు అందించారు. ఇక మా కష్టాలు తీరినట్టే.

– పసుపులేటి జ్యోతి, ఐఎస్ జగన్నాథపురం

ఇక ధైర్యంగా సాగు చేస్తా



నేను సాగు చేస్తున్న భూమిని ఎప్పుడు ఎవరొచ్చి లాక్కుంటారో తెలియక బిక్కుబిక్కుమంటూ పంటలు పండించే వాడిని. అత్యవసర పరిస్థితుల్లో భూమిని అమ్ముకుందామన్నా హక్కు లేదు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఇక ధైర్యంగా సాగు చేస్తా.

– కటికి భగవన్నారాయణ, ఐఎస్ జగన్నాథపురం.

నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట


ఆగిరిపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ఆగిరిపల్లి: పదేళ్ల పాటు నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వాడుకుని అనేక సార్లు తనకే టికెట్ కేటాయించానని తెలిపి ఎన్నికలు వచ్చే సరికి టికెట్ ఇవ్వకుండా నమ్మించి దగా చేసిన వ్యక్తి చంద్రబాబునాయుడు అని నూజివీడు నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరావు అన్నారు. ఆదివారం రాత్రి ఆగిరిపల్లిలో ముద్రబోయిన వెంకటేశ్వరరావు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీలో కొంతమంది అగ్రకుల నాయకులు ఎన్నోసార్లు అవమానించినా భరించానన్నారు. టీడీపీ కోసం పదేళ్ల కష్టపడిన తనను పక్కనపెట్టి రూ.కోట్లు దండుకుని నూజివీడు టీడీపీ టికెట్‌ను వేరే వ్యక్తికి అమ్ముకున్నారని ఆరోపించారు. పెనమలూరు నుంచి నూజివీడుకు వలస వచ్చిన టీడీపీ అభ్యర్థి అవినీతి గురించి ప్రజలు కథలుగా చెప్పుకుంటున్నారని అన్నారు. టీడీపీలో బీసీలకు విలువ లేదని వాపోయారు. నూజివీడులో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి తెలుగుదేశం పార్టీని నామరూపాలు లేకుండా చేస్తానని ముద్దరబోయిన హెచ్చరించారు.

మద్యం అక్రమ రవాణా ముఠా అరెస్టు

తణుకు: పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి స్థానికంగా అధిక ధరలకు విక్రయిస్తున్న ముఠాను సోమవారం తణుకు పోలీసులు అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కఠ్రావారి సావరం గ్రామానికి చెందిన బోయిన బాలాజీ, రాజమహేంద్రవరానికి చెందిన తుమ్మల రాధా కృష్ణ గిరీష్‌కుమార్‌లను అరెస్టు చేసి వారి నుంచి 220 మద్యం బాటిళ్లతోపాటు కారు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. తణుకులో డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి వివరాలు వెల్లడించారు. బాలాజీ తన పథకాన్ని స్నేహితుడు లారీ డ్రైవర్ ఉండ్రాజవరం మండలం వడ్లూరుకు చెందిన ఇజ్జాడ పాపినాయుడుకు చెప్పగా, కిరాయిల నిమిత్తం పొరుగు రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడ మద్యం కొని బాలాజీకి ఇస్తున్నాడు. నెల క్రితం అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన 240 ఫుల్ బాటిళ్లను బాలాజీకి ఇచ్చాడు. వీటిలో 12 బాటిళ్లను ఇల్లిందలపర్రు కు చెందిన గంద్రోతు ఏసుకు, మరో 8 బాటిళ్లను ఉరదాళ్ల పాలెంకు చెందిన మాకా రాజేష్‌కు ఇచ్చాడు. మిగిలిన 220 బాటిళ్లను రాజమహేంద్రవరానికి చెందిన తుమ్మల రాధాకృష్ణ గిరీష్‌కుమార్‌కు ఈనెల 10 ఆటోలో తీసుకువచ్చి గిరీష్‌కుమార్ కారులో ఎక్కిస్తున్నారు. పట్టణ సీఐ ఎం.నాగరాజు, ఎస్సై కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి 220 మద్యం బాటిళ్లు, కారు, ఆటో సీజ్ చేసి వారి నుంచి రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పాపినాయుడు, రాజేష్, ఏసుబాబు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.


వైఎస్సార్ సీపీలోకి కాంగ్రెస్ నాయకులు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి వనిత


భీమేశ్వరరావుకు పార్టీ కండువాను కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: జగనన్న సంక్షేమ పాలనకు ఫిదా అయిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని రామన్నగూడెంకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు భారీ బైక్ ర్యాలీగా బయల్దేరి ముందు శ్రీవారి సన్నిధికి చేరుకున్నారు. స్వామివారి పాదుకా మండపం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం వారు స్థానిక కాపు కల్యాణ మండపానికి చేరుకున్నారు. అక్కడ మంత్రి వనిత భీమేశ్వరరావుకు, అలాగే పెండ్లి రవీంద్ర, జె.సత్యన్నారాయణ, కె.వెంకటేశ్వరరావు, పి.భాస్కరరావు తదితరులకు కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆ పార్టీ మండల కన్వీనర్ వైఎస్సార్ సీపీలో చేరడం శుభపరిణామమని అన్నారు. ఆయన సేవలు తమ పార్టీకి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం భీమేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యులు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, ఆచంట బన్ను, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బొండాడ వెంకన్నబాబు, మానుకొండ సుబ్బారావు, జిత్తుక శ్రీను, పాకలపాటి శ్యామ్‌కుమార్, షేక్ ఇస్మయిల్, దాము, కాసన్న వెంకటేశ్వరరావు, యాదాల శ్రీను, గొర్రెల పల్లాలు, పెండెల విజయ్, పెండెల ముక్కరామన్న, పెండెల దుర్గయ్య, కొత్తపల్లి రమేష్, తల్లిబోయిన వెంకట్రావు తదితరులున్నారు.

బోదెలోకి దూసుకెళ్లిన కారు


మురుగుబోదెలో ఉన్న కారు

ఉండి: ఓ కారు అదుపుతప్పి మురుగుబోదెలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. భీమవరం నుంచి ఉండి వైపు వెళుతున్న ఓ కారు ఎన్నార్పీ అగ్రహారం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి కల్వర్టును ఢీకొని మురుగు బోదెలోకి దూసుకెళ్లింది. కారు ముందు భాగం పూర్తిగా తెబ్బతింది.